

వికారాబాద్ దవాఖానలో వైద్యం అందుతున్న తీరుపై రోగులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

# రోగుల పరిస్థితి ఆగమాగం..

**వికారాబాద్ సర్కారు దవాఖానలో వసతులు కరువు**

- మందులివ్వరు.. పరీక్షలు చేయరు.. మిషన్లు మూలకు..
- గర్భవతులు, బాలింతలకు అందని కిట్లు..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ.. జాడలేని జనరేటర్..
- జిల్లాకు స్పీకర్, ముఖ్యమంత్రి ఉన్నా అభివృద్ధి ఏది..?
- వికారాబాద్ అభివృద్ధికి రూ.4వేల కోట్లు ఎక్కడ..?
- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు
- రోగుల ఆరోగ్యంపై ఆరా



ప్రభుత్వ ఆసుపత్రికి ఓపీకి వచ్చిన రోగులు

ధారూరు, జనవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్ బందయ్యాయని.. బ్లడ్ క్యాంపులు పెట్టి బ్లడ్ సేకరించడానికి పరికరాలు సరిగా పనిచేయడంలేదని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి వికారాబాద్ పట్టణ నాయకులతో కలిసి వెళ్లారు. అసుపత్రిలోని డయాలసిస్ సెంటర్, డయాగ్నోస్టిక్ సెంటర్, బ్లడ్ బ్యాంకులను సందర్శించి, ఓపీలో ఉన్న రోగులను వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాను వికారాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరు చేయించడం జరిగిందన్నారు. గత నాలుగు నెలలుగా బ్లడ్ బ్యాంక్‌లోని ఫ్రిజ్ పనిచేయడంలేదని తెలిసిందన్నారు. బ్లడ్ క్యాంపులు పెట్టి బ్లడ్ సేకరించడానికి పరికరాలు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోగులందరికీ దాదాపు 100 రకాల పరీక్షలు ఉచితంగా చేయడానికి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వికారాబాద్ జిల్లాకు సంబంధించిన 32.. మొత్తం 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాలకు సంబంధించిన రోగులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాహనాలను పెట్టి మరీ నమూనాలకు సంబంధించిన పరీక్ష రిపోర్టులను తిరిగి అదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరేలా చూడడం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు ఇక్కడ ఉన్న పరిస్థితులు చూస్తే అంతా తలకిందులుగా ఉందన్నారు. మిషన్లు పనిచేయడం లేదు, వాటిని పట్టించుకునే నాథుడే లేడు, అధికారుల పర్యవేక్షణ లోపించిందన్నారు. బ్లడ్ శాంపిల్స్ తీసుకొని 12 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రిపోర్టులు అందడం లేదని పేషెంట్లు వాపోతున్న పరిస్థితి పలు పత్రిక కథనాలు సైతం వెల్లడిస్తున్నాయన్నారు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నదని ఆరోపించారు.

### రోగులపై దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు

గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా గర్భవతులు, బాలింతల సంరక్షణ కోసం ప్రభుత్వ వాహనాలు పెట్టి ఇంటి నుంచి ఆసుపత్రికి తీసుకువచ్చి అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా చేసి తిరిగి వారిని ఇంటి దగ్గర దింపేవి, కానీ ఇప్పుడు వారు సొంత డబ్బులతో ప్రైవేటు వాహనాల్లో రావలసిన భారం ఏర్పడిందన్నారు. కేసీఆర్ గర్భవతులకు కెసీఆర్ న్యూట్రిషన్ కిట్, తల్లీబిడ్డల సంరక్షణ కోసం కేసీఆర్ కిట్ అందించి వారి ఆరోగ్యంపై దృష్టి సారించారన్నారు. కానీ ఇవి ఇప్పుడు అందజేయడంలేదన్నారు. డాక్టర్లు మందులు బయటకు రాసిస్తున్నారని పేషెంట్లు వాపోతున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇక్కడ ఉండగా.. మందులు బయటకు రాయాల్సిన పరిస్థితి ఎందుకొస్తుందని, మందులు రావడం లేదా ఒకవేళ వస్తే పేషెంట్లకు ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. స్కానింగ్ కూడా బయటకు రాస్తున్నారని పేషెంట్లు చెపుతున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న పత్రికలు కూడా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని లోపాలను ఎత్తిచూపుతుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రభుత్వ ఆసుపత్రికి జనరేటర్ మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుతం జనరేటర్ ఎక్కడ ఉందని అడిగితే అసుపత్రిలో ఎవరికీ తెలియని పరిస్థితి ఎర్పడిందన్నారు. ఇప్పటికైనా సీఎం వీటిపై దృష్టి పెట్టి రోగులకు ఎక్కడ కూడా ఇబ్బంది కలుగకుండా చూడాలని ప్రధాన ప్రతిపక్షంగా, ప్రజల పక్షాన తెలియజేస్తున్నానన్నారు.

### అన్ని పనులూ అరకొరే..

రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.8కోట్లను కేసీఆర్ సర్కారు మంజూరు చేసిందన్నారు. బ్రిడ్జి మంజూరు చేసి ఏడాదిన్నర అవుతున్నా కొంత వరకు పనులు నిర్వహించి అపివేశారన్నారు. బ్రిడ్జి పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజలు బ్రిడ్జి నిర్మాణ పనులకు సహకరించాలని.. నిర్మాణంలో ఎవరైనా ఇండ్లు కోల్పోతే వారికి పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతు రుణ మాఫీ ప్రతి గ్రామంలో 50 శాతం మాత్రమే పూర్తయిందని, అందరికి రుణ మాఫీ సంపూర్ణంగా చేయాలనన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో షరతులు లేకుండా ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, సీనియర్ నాయకులు వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ధారూరు మండల యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వికారాబాద్ మండల యువజన విభాగం అధ్యక్షుడు గిరీశ్ కొఠారి, నాయకులు అఫ్జల్‌పాషా, అనిల్, మల్లేశ్, మల్లికార్జున్, సురేశ్, సుభాన్‌రెడ్డి, గోపి, సంగమేశ్, దత్తు, రమణ, సురేశ్‌గౌడ్, అశోక్, సుభాన్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మహిపాల్‌నాయక్, నర్సింహ, రాజు, జైపాల్, శ్రీను, కిశోర్, సత్యనారాయణ, సోనూరాథోడ్ ఉన్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామసభలపై సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, సివిల్ సప్లయ్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, గతంలో నిర్వహించిన ప్రజా పాలన, గ్రామ సభల మాదిరిగానే 21 నుంచి చేపట్టే గ్రామ సభలను నిర్వహించాలన్నారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేయటం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా కులగణన, సర్వే ఆధారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని పేర్కొన్నారు.

### ఈ నెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులను కూడా స్వీకరించడం జరుగుతుందన్నారు. గతంలో జరిగిన ప్రజా పాలన సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉన్నదని తెలిపారు. ఇంకా మిగిలిన ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి, గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించేటప్పుడు కుటుంబ యాజమాని, కుటుంబసభ్యుల పేర్లు పేర్లు, ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్, అడ్రస్ తీసుకోవాలన్నా. ఎవరైనా పేర్లు మిస్సయితే ప్రజా పాలన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డులకు సంబంధించి ప్రతీది రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్నవారి జాబితా, ఇంటి స్థలంలేని వారి రెండు జాబితాలను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభల్లో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. జిల్లాలో అర్హులందరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని, రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు



టెలీ కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

## ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**ఆదిబట్ల :** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. గణతంత్ర దిన వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణికి 87 ఫిర్యాదులు రాగా.. వాటిలో రెవెన్యూశాఖ 38, ప్రజాపాలన దరఖాస్తులు 10, పీడీ హౌసింగ్ సంబంధించి 9 వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## రిజర్వాయర్‌కు ప్రణాళికలు

సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ): నియో పోలిస్, కోకాపేట్ ప్రాంతాల్లో భవిష్యత్‌లో నీటి అవసరాల దృష్ట్యా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని, గోదావరి-2 ప్రాజెక్ట్ నుంచి నీటిని తీసుకొని ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించడానికి, నియోపోలిస్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పంప్ హౌజ్, స్థానిక అవసరాల కోసం రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసే దిశగా జలమండలి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఈమేరకు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి అశోక్‌రెడ్డి సోమవారం కోకాపేట్, నియో పోలిస్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆ తర్వాత ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించిన అశోక్‌రెడ్డి మంజీరా, కృష్ణా, గోదావరి పథకాల ద్వారా ఎక్కడి నుంచి వచ్చే నీటినైనా ఇక్కడ నుంచి గ్రావిటీ ద్వారా నగరానికి సరఫరా చేసే అవకాశం ఉన్నందున భవిష్యత్ అవసరాల కోసం రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం, గండిపేట్ నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు ఉన్న కాండ్యూట్‌ని అశోక్‌రెడ్డి పరిశీలించారు. కాండ్యూట్‌కు రెండువైపులా మెయింటెనెన్స్ రోడ్లు ఉన్న ఎదున ఆ భాగం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడక్కడ జరుగుతున్న కాండ్యూట్ లీకేజీలను గమనించి, వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా కాండ్యూట్ కబ్జాకు గురైనట్లు గమనిస్తే జలమండలి విజిలెన్స్ అధికారుల సాయంతో అవి తొలగించాలని సూచించారు. కోకాపేట గ్రామంలోని జల మండలి రిజర్వాయర్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ప్రెజర్ ఫిల్టర్స్‌ను జలమండలి అధికారులు పరిశీలించారు. ఫిబ్రవరి 15 లోపు ఈ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ఈ ఫిల్టర్స్ ద్వారా నేరుగా కాండ్యూట్ నుంచి నీటిని సేకరించి వాటిని శుద్ధిచేసి పరిసర ప్రాం తాలకు సరఫరా చేసే వెసులుబాటు ఉం టుందని తెలిపారు. వేసవి అవసరాలకు ఈ ప్రాంతంలో ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణానికి కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయ కమిటీ ప్రమాణస్వీకారం
- పాల్గొన్న మంత్రి జూపల్లి , ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే శంకర్




కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గ్రంథాలయ కమిటీ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20 : గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, యువత గ్రంథాయాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రంథాయాలు మనకు అవసరమైన విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. విద్యార్థులు, యువత క్రమం తప్పకుండా గ్రంథాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పూర్తి సమాచారాన్ని అందజేయడంలో గ్రంథాయాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని మంత్రి తెలిపారు. షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు కృషి చేస్తామని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నూతన అభివృద్ధి కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అభినందించారు. అనంతరం అభివృద్ధి కమిటీ చైర్మన్ మధుమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు వీరేశ్‌కుమార్, నక్క బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లతోపాటు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సర్వర్‌పాషా, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు పాల్గొన్నారు.

## కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆర్టీసీ అసిస్టెంట్ కార్గో మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్**



షాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ అసిస్టెంట్ కార్గో మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్

షాబాద్, జనవరి 20 : ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇషాక్ మహమ్మద్ అన్నారు. సోమవారం షాబాద్ ఆర్టీసీ బస్టాండులో కార్గో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్గో ద్వారా వినియోగదారులకు డోర్ డెలివరీ సదుపాయం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు కార్గోను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్టీసీ డిపో డీఎంఈ శ్రీనివాస్, షాబాద్ ఆర్టీసీ బస్టాండ్ మేనేజర్ వెంకటేశ్, కార్గో నిర్వహకుడు మల్లేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

## వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

**డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి**

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20 : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని శ్రీజగద్గురు పంచాచార్య వీరశైవ ఆగమ పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు వ్యాపించవన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎం సుగుణ, ఆశాలున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

## పాఠశాల సందర్శన


పెద్దేముల్, జనవరి 20 : పెద్దేముల్‌లోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం వికారాబాద్ డీఈవో రేణుకాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంగ్లంపై విద్యార్థులు ఎక్కువ దృష్టి సారించేలా చూడాలని, వెనుకబడిన విద్యార్థులకు టీఎల్ఎం విధానాన్ని వాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులను మన పిల్లలుగా చూసుకోవాలని తెలిపారు. రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదని, ఆ సంఖ్యను పెంచే బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింగ్‌రావు, హెచ్ఎంలు సునీత, శివకుమార్, జోజప్ప, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆశన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆదాయం పట్టణ ప్రాంతంలో 2 లక్షల లోపు ఉండాలని చెప్పారు. ఫిబ్రవరి 9 వరకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం 040-24071178ను సంప్రదించాలన్నారు

## నాణ్యమైన సీఎంఆర్ రైస్ అందజేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 20 : నాణ్యమైన సీఎంఆర్ రైస్‌ను అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని పౌరసరఫరాల కార్యాలయంలో ధాన్యం డెలివరీపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బియ్యాన్ని అందజేయాలన్నారు. జనవరి 25లో 2221 టన్నుల సన్నబియ్యంతో పాటు 2023-24 రబీకి సంబంధించి 5499.279 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కూడా అందజేయాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఏపీఎస్‌వో ఆర్తీనాయక్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడే బాలేశ్వర్‌గుప్తా, కార్యదర్శి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## శ్రీనివాస్‌కు డాక్టరేట్

**ఆర్కేపురం :** తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, కుర్తాళం శ్రీసిద్దేశ్వరీ పీఠం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఇండోర్‌లోని మా భువనేశ్వరి ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌కు ఇటీవల జరిగిన కార్యక్రమంలో అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా తాను చేస్తున్న అన్నదాన, ఆధ్మాత్మిక సేవలతోపాటు ఉచిత వివాహ సేవలందిస్తున్నందుకు యూనివర్సిటీవారు డాక్టరేట్ అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆదర్శంగా నిలువాలి

**ఎస్పీ నారాయణరెడ్డి**



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 20 : క్రీడలు, ఆటలతో శారీరక దారుఢ్యం, ఆరోగ్యం పెరుగుతుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఇంటర్ జోన్‌లో గెలిచిన పోలీస్ క్రీడాకారులు జోన్ తరపున జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో జరుగబోయే 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ పోలీస్ మీట్స్‌లో పాల్గొంటారన్నారు. వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025లో గెలుపొందిన రెండు జిల్లాల పోలీస్ క్రీడాకారులకు ఈ రోజు చార్మినార్ జోన్‌లోని ఈ రెండు జిల్లాలకు ఇంటర్ జోన్ క్రీడా పోటీలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. 2025 ఆన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో జోన్ నుంచి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా క్రీడలు, ఆటల్లో రాణిస్తున్న పోలీసులు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సమస్యలపై ఫోరంలో ఫిర్యాదు చేయాలి

హయత్‌నగర్, జనవరి 20 : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో 'వినియోగదారుల హక్కులు, బాధ్యతలు' అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఉర్దూ యూనివర్సిటీ డీన్ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొ.బదియుద్దీన్‌అహ్మద్ విచ్చేసి మాట్లాడారు. వినియోగదారులు ఎక్కడైనా మోసపోతే వాళ్లు ఫోరంలో అభ్యర్థించి పరిష్కారాన్ని పొందవచ్చున్నారు. కళాశాల వినియోగం-వినియోగదారుల సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్యం వినియోగదారుల హక్కు చట్టం 2019 గురించి వివరించారు